క్లుప్తంగా

నేటి నుంచి పశువులకు టీకాలు



కొల్లిపర: నేటి నుంచి సెప్టెంబర్ 18 వరకు పశువులకు వ్యాపించే గాలికుంటు వ్యాధి నివారణకు పశు వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి రైతు ఇంటి వద్దనే పశువులకు టీకాలు వేయటం జరుగుతుందని మండల పశు వైద్యాధికారి డాక్టర్ సాయిసతీష్‌రాజు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా గాలికుంటు వ్యాధి టీకాలు వేయటం జరుగుతుందన్నారు. కొల్లిపర మండలానికి 9,750 డోసుల టీకాలు వచ్చినట్లు పేర్కొన్నారు. గాలికుంటు నివారణ టీకాల కారణంగా పాడి గేదెలలో పాలు తగ్గిపోతాయనో, జ్వరం వచ్చిందనో అపోహలు వీడి రైతులు తమ పశువులకు టీకా వేయించుకోవాలని కోరారు. 4 నెలలు దాటిన ప్రతి పశువుకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. కొల్లిపర మండలంలో గేదెలు 11,466, ఆవులు 354 , మేకలు 1,075, గొర్రెలు 2,065 ఉన్నాయని తెలిపారు.

రేపు విద్యుత్ అదాలత్

తెనాలిరూరల్: విద్యుత్ శాఖకు సంబంధించి వినియోగదారుల సమస్యలు/ఫిర్యాదుల పరిష్కారం కోసం ఈ నెల 21వ తేదీన కన్జ్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం(సీజీఆర్ఎఫ్)పేరిట విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ తెనాలి డివిజన్ ఈఈ వీవీ చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి చెంచుపేటలోని విద్యుత్ ఈఈ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అదాలత్ జరుగుతుందన్నారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేల్ ఫోరం సభ్యులు, జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు అదాలత్‌కు హాజరై తమ ఫిర్యాదులను లిఖిత పూర్వకంగా విద్యుత్ సర్వీసు పూర్తి నంబరు, చిరునామా, సెల్ నంబరుతో అర్జీ ఇచ్చి సమస్యలను పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

వైభవంగా విఖనస మహర్షి జయంతి

ఫిరంగిపురం: మండల కేంద్రంలో విఖనస మహర్షి జయంతిని సోమవారం వైభవంగా నిర్వహించారు. విఖనస మహాముని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వేద పండితులు నారాయణం ప్రసాదాచార్యులు విఖనస మహర్షి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్.వంశీకృష్ణ, డి.ప్రసన్నమూర్తి, నరసింహమూర్తి, అజయ్‌కుమార్, డి.కృష్ణమూర్తి, డి.యామిని సాయి పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి ఐతానగర్ నుంచి నేలపాడు వెళ్లే మార్గంలోని చెరువులో మృతదేహం తేలుతుండడాన్ని స్థానికులు సోమవారం గుర్తించి చెరువు యజమానికి సమాచారమిచ్చారు. ఆయన అక్కడకు వచ్చి పరిశీలించి చెరువులో మృతదేహం పడి ఉందంటూ టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించారు. అతడిని ఐతానగర్ అత్తోట వారి వీధికి చెందిన కొబ్బరి బొండాల వ్యాపారి మల్లెల బసవయ్య(55)గా గుర్తించారు. అయితే ప్రమాదవశాత్తూ చెరువులో పడ్డాడా? లేక మరేదైనా కారణమా అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతి చెంది మూడు రోజులై ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడికొండ: ఫిట్స్‌తో స్పృహతప్పి పడిపోయిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడికొండలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తన్నీరు శంకరరావు సోమవారం ఉదయం బయటకు వెళుతుండగా చింతచెట్టు సెంటర్ వద్దకు రాగానే ఫిట్స్ రావడంతో వెనక్కి పడగా తలకు బలమైన గాయమైంది. జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు చెప్పారు.

గోడ కూలి వ్యక్తి మృతి

ముక్కామల(తాడికొండ): ప్రమాదవశాత్తు గోడకూలి వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... కృష్ణా జిల్లా కోడూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన ఆదిపూడి సంజీవరావు(40) మరి కొంత మంది వ్యవసాయ పనుల కోసం ముక్కామల గ్రామంలో ఉంటున్నారు. వినాయకచవితి పందిర్లు వేసేందుకు ఖాళీ స్థలంలో చెట్లు పీకుతూ గోడపైకి ఎక్కగా అది కూలడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించగా ఈ ఘటనలో సంజీవరావు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ద్విచక్ర వాహనం దహనం

తాడికొండ: గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి ద్విచక్ర వాహనానికి నిప్పంటించి పారిపోయిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ వాసు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ గ్రామానికి చెందిన అచ్యుతరావు ఎప్పటిలానే తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి బయట పార్కింగ్ చేసి నిద్రపోయాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక

తెనాలిఅర్బన్: ఆరోగ్యంపై పారిశుద్ధ్య కార్మికులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. ఈఎస్ఐ విజయవాడ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అలాగే మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కమిషనర్ బండి శేషన్న మాట్లాడుతూ ఆధునిక జీవన శైలిలో వస్తున్న మార్పుల వలన ఎక్కువ మంది అనారోగ్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వైద్యులు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఈఎస్ఐ వైద్యులు డాక్టర్ అఖిలాదాస్, డాక్టర్ యు.రాగదీపిక, డాక్టర్ ఎస్.వెంకటరమణ దీపిక తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

రేపటి దేశ వ్యాప్త బంద్‌ను జయప్రదం చేయండి

తెనాలిఅర్బన్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ విరుద్ధమని, దానిని పునః సమీక్షించాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తెనాలి డివిజన్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం కొన్ని రాజకీయ పార్టీలు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగాన్ని బలహీనపరిచి, రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కుట్ర పన్నారని, దీనిలో భాగంగానే సుప్రీం కోర్టుతో తీర్పు ఇప్పించారని విమర్శించారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 21వ తేదీన దేశ వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, దళిత, గిరిజన, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బంద్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేఏసీ తెనాలి డివిజన్ కన్వీనర్ కనపర్తి అనిల్, టౌన్ అధ్యక్షుడు బండ్లమూడి నాని, జేఏసీ నాయకులు కనపర్తి అబ్రహాం లింకన్, శెట్టి అంబేడ్కర్, అక్కిదాసు కిరణ్, దారా రామకృష్ణ, యాతాటి అనిల్, యనమద్రి శ్యామ్, బడుగు రమేష్, పిల్లి గంగాధర్, యండ్రపాటి స్టాలిన్, కర్ర రాజారత్నం, పిల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అనిల్, నాని, తదితరులు

కొలకలూరు సర్పంచ్ అవినీతిపై విచారణ

జిల్లా కలెక్టర్‌ను కోరుతూ అర్జీనిచ్చిన గ్రామస్తులు

తెనాలి: రూరల్ మండల గ్రామం కొలకలూరు పంచాయతీ సర్పంచ్ చొప్పర ప్రీతి నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆ గ్రామానికి చెందిన పలువురు సోమవారం జిల్లా కలెక్టర్‌ను కలిసి అర్జీని అందజేశారు. సంబంధిత నివేదికను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు అందజేస్తామని అర్జీదారుల్లో ఒకరైన తోట నరేంద్ర వెల్లడించారు. గ్రామ సర్పంచ్‌గా చొప్పర ప్రీతి ఎన్నికయ్యాక తొలిసారిగా రూ.92 లక్షల చెల్లింపు వ్యవహారంలో చెక్ పవర్‌ను కోల్పోయినట్టు గుర్తుచేశారు. 2023లో మళ్లీ రూ.98 లక్షలను నగదు రూపంలో చెల్లించి, మరోసారి చెక్ పవర్‌ను కోల్పోయారని తెలిపారు. పెద్దల సాయంతో కోర్టును ఆశ్రయించి చెక్ పవర్‌ను దక్కించుకున్నా, సర్పంచ్ వ్యవహారశైలిలో మార్పులేదన్నారు. ఎన్నికల్లో వారికి అండగా నిలిచిన వారికి, గ్రామస్తులకు ఎటువంటి మర్యాద చూపకుండా ఒంటెద్దు పోకడలతో పరిపాలన చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలకు జవాబుదారీతనం లేకుండా ఉంటున్నారని చెప్పారు. ఏటా రూ.2 కోట్ల బడ్జెట్ కలిగిన కొలకలూరు పంచాయతీలో ఏ మేరకు అవినీతి జరిగిందనేది సమగ్ర విచారణలోనే తేలుతుందని స్పష్టం చేశారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలనేది తమ ఆకాంక్షగా వివరించారు.



అర్జీనిచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడుతున్న తోట నరేంద్ర

పరిసరాల పరిశుభ్రతతో డయేరియా నిర్మూలన

పొన్నూరు: పరిసరాల పరిశుభ్రతతోనే డయేరియాను నిర్మూలించగలమని జల జీవన మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ పి.తేజ్ సంగీత్ అన్నారు. సోమవారం జల జీవన మిషన్ ఆధ్వర్యంలో వెల్లలూరు గ్రామంలో డయేరియా నిర్మూలనకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.రమేష్ అధ్యక్షతన డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ్ సంగీత్ మాట్లాడుతూ భోజనం చేసే ముందు, మల విసర్జనకు అనంతరం చేతులు శుభ్రం చేసుకోవాలని తెలిపారు. వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని, ఈగలు వాలిన ఆహార పదార్థాలను దూరం పెట్టాలని చెప్పారు. ప్రతిరోజు గోరువెచ్చని నీటిని తాగడం ద్వారా జీర్ణక్రియ బాగా పని చేస్తుందని పేర్కొన్నారు. క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న తేజ్ సంగీత్

జీజీహెచ్‌లో మందుబాబులకు నో ఎంట్రీ

- అర్ధరాత్రి ఆస్పత్రుల్లో తిరగొద్దు..
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్
- జీజీహెచ్‌లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ
- సెక్యూరిటీ ఏజెన్సీ, పార్కింగ్ గుత్తేదారులకు నోటీసులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో మందుబాబులు, బిచ్చగాళ్లకు ఎలాంటి ప్రవేశాలు కల్పించవద్దని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగిక దాడి ఘటన నేపథ్యంలో ఆదివారం రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు జీజీహెచ్‌లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆస్పత్రిలో మద్యం తాగిన వాళ్లు, బిచ్చగాళ్లు ఆస్పత్రిలో తిష్ట వేసి ఉండటాన్ని గమనించి వారికి క్లాసు పీకారు.

రక్షణ సిబ్బంది కీలకం..

ఆస్పత్రిలో ఎవరేవరు వస్తున్నారో.. బయటకు వెళుతున్నారో రక్షణ సిబ్బంది గమనించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో కొంత మంది అర్ధరాత్రి తిరుగుతుండటాన్ని ఆక్షేపించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాత్రి 10 గంటల తరువాత రోగులతో పాటు వారి సహాయకులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి వస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పోలీసులు పెట్రోలింగ్ అవసరమన్నారు. పెద్ద సంఖ్యలో వస్తున్నా రోగుల సహాయకులను కట్టడి చేయడంలో విఫలమైన గుత్తేదారుకు నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే రోగితో పాటు ఒకరిద్దరు మాత్రమే రావాలని ఎక్కువసంఖ్యలో రావడం వలన ఇబ్బందిగా ఉంటుందని వెల్లడించారు.

లోపాలు లేకుండా భద్రత..

ఆస్పత్రిలో రక్షణ వ్యవస్థలో లోపాలు కనిపిస్తున్నాయని డాక్టర్ కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కొంతమంది వైద్యులు బయట నుంచి వస్తున్నారని అదే విధంగా ఆస్పత్రిలో ఉన్న కొంతమంది వైద్యులు బయట తిరుగుతున్నారని, ఇది వైద్యులకు అంత శ్రేయస్కారం కాదన్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ఆస్పత్రిలో పార్కింగ్ చేసి బయటకు వెళుతున్నారని దీనివల్ల అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. ఆసుపత్రికి సంబంధం లేనివారు.. రోగులతో సంబంధం లేని వారు అనేకమంది ఆస్పత్రిలో మద్యం తాగి వస్తున్నారని చెప్పారు. అంబులెన్స్ వాహనాలు కూడా గంటల తరబడి ఉండటం వలన పార్కింగ్ సమస్య ఎక్కువతున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ వెంట డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ఏఆర్ఎంఓ డాక్టర్ సునీత ఉన్నారు.



రాత్రి భద్రతపై పోలీస్, వైద్య సిబ్బందిని ఆరా తీస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

దేశాంబకు శ్రావణ పౌర్ణమి పూజలు

మంచాల (చేబ్రోలు): మండలంలోని మంచాల గ్రామ దేవత దేశాంబకు శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఘనంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ 32వ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. పూర్ణచంద్ర శ్రీనివాసమూర్తి అభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



తెనాలిఅర్బన్: ప్రపంచ ఫొటోగ్రఫీ వేడుకలను లయన్స్ క్లబ్ ఆఫ్ తెనాలి స్నేహ ఆధ్వర్యంలో సోమవారం తెనాలిలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపకులు కాకరపర్తి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లు అద్భుతమైన చిత్రాలను తమ కెమెరాల్లో బంధిస్తూ ఉంటారని తెలిపారు. అనంతరం ఫొటోగ్రాఫర్ ఉప్పలపాటి వెంకటరామకృష్ణ (రాము)ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు డాక్టర్ కొత్తపల్లి రాజ్‌కుమార్, జవ్వాజి శ్రీనివాసరావు, తన్నీరు శివశంకర్, ఉప్పలపాటి గిరీష్, ఎ.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అనధికార కట్టడాలపై దృష్టి సారించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలో అనధికార కట్టడాలపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించడంతో పాటు వాటిని అడ్డుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు వార్డుల్లో పర్యటిస్తూ ఉండాలని సూచించారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు జరుపుకునే వారికి ప్లాన్‌లు అందజేయాలన్నారు. ఏసీపీ సుబ్బారావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని తెనాలి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాజీచౌక్‌లోని కృష్ణా స్టూడియోలో సోమవారం సాయంత్రం నిర్వహించారు. అసోసియేషన్ నాయకులు కేక్ కట్ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు అన్నదానం చేశారు. అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రభాకర్, రఘు, నాయకులు ప్రసాద్, రవిశంకర్, బాబీ, సాయినాథ్, రవి, గిరీష్, వసంత్, రమేష్, చిరంజీవి పాల్గొన్నారు.

తాగునీటి నమూనాల సేకరణ

మంగళగిరి: ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించేందుకు నగరంలో సరఫరా అవుతున్న ఇంటి కుళాయిలు, వీధి కుళాయిల నుంచి 750కు పైగా శాంపిల్స్ సేకరించడం జరిగిందని నగర కమిషనర్ అలీంబాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కుళాయిలతో పాటు 136 ప్రైవేటు వాటర్ ప్లాంట్లు నుంచి నీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపించామన్నారు. నగర ప్రజలు తమ వార్డుల పరిధిలో తాగునీరు కలుషితం, రంగు మారటం జరిగితే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలన్నారు. తాగునీటి సరఫరాపై సమస్యలు తెలిపేందుకు 08645–295192, 7093912653లకు ఫోన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

దోమల నియంత్రణపై దృష్టి

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో దోమల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. నీటి నిలువ మురుగు కాలువలలో సోమవారం గంబూషియా చేపలను వదిలారు. ఆయన మాట్లాడుతూ దోమలును నియంత్రించేందుకు హెల్త్ సెంటర్‌ల పరిధిలోని పాడు బడిన బావులు, కాలువలలో గంబూషియా చేపలను వదలడం జరిగిందన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్ళతో పాటు చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.అనూష పాల్గొన్నారు.

కేవీకే పార్థీనియం మొక్కల నివారణ వారోత్సవాలు

గుంటూరు రూరల్: పార్థీనియం (వయ్యారిభామ) కలుపు మొక్కల ద్వారా పంటలకే కాకుండా జీవరాశికి నష్టం కలుగుతుందని కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి తెలిపారు. పార్థీనియం మొక్కల నివారణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం నగర శివారులోని లాంఫాం నందున్న కేవీకే ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం గృహ విజ్ఞాన కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ వయ్యారి భామ కలుపు మొక్క అత్యంత ప్రమాదకరమైనదని తెలిపారు. ఈ మొక్కలు పూత రాక ముందే వేళ్లతో సహా పీకి తగలబెట్టాలన్నారు. జైగో్రామబైకలరేట్ మందును పిచికారి చేయటం, లేదా అక్షింతల పురుగు కీటకం ద్వారా కూడా వీటిని అరికట్టవచ్చని తెలిపారు. ఈ మొక్కల పుప్పొడి ద్వారా మనుషులకు చర్మ వ్యాధులు, ఆస్తమా, కాన్సర్ వంటి రోగాలు వస్తాయన్నారు. క్షేత్రస్థాయిలో వయ్యారి భామ మొక్కలు పీకి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ బిలిక్విస్ విద్యార్థులు తదితరులున్నారు.

ప్రజ్ఞాచారికి తెలుగు భాషా పురస్కారం

తెనాలిరూరల్: తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన ప్రముఖ కవి డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి తెలుగు భాషా పురస్కారాన్ని అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన సాహితీ సదస్సులో ప్రజ్ఞాచారికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న నేషనల్ లెజెండరీ అవార్డు గ్రహీత, డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి, శ్రీ శ్రీ కళా వేదిక తెలుగు భాషా పురస్కారం ప్రదానం చేసింది. ఆగస్టు 29 తెలుగు భాషా దినోత్సవం, తెలుగు భాష సేవకుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని అంతర్జాతీయ గుర్తింపు పొందిన సాహితీ సంస్థ శ్రీ శ్రీ కళావేదిక 138వ శతాధిక కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తీపి అక్షరం తెలుగు శీర్షిక పేరుతో డాక్టర్ ప్రజ్ఞాచారి పద్య పఠనం చేయగా కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు చిట్టే లలిత, ఈశ్వరి భూషణ్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ పార్థసారథి, డాక్టర్ నర్ర నరసింహమూర్తి, డాక్టర్ బి.వి.సత్యనారాయణ, బాలార్జున సత్యనారాయణ, గుండాల రాకేష్ తదితరులు ప్రజ్ఞాచారికి తెలుగు భాషా పురస్కారం ప్రదానం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం వివరాలను ఇక్కడ వెల్లడించారు.



పురస్కారం అందుకుంటున్న పూర్ణ ప్రజ్ఞాచారి

రాష్ట్ర స్థాయి పోటీలకు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు

తెనాలిఅర్బన్: రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు షేక్ మౌలాబీ పేర్కొన్నారు. తెనాలి కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ బాయ్స్ హైస్కూల్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 18న తక్కెళ్ళపాడులో జరిగిన జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. వివిధ విభాగాల్లో బంగారు పతకాలు ఐదు, వెండి మూడు, కాంస్యం మూడు పతకాలు సాధించినట్లు చెప్పారు. వీరిలో ధనాల తనుశ్రీ, పాలపర్తి లక్ష్మీప్రసన్న, లీల నాగేంద్రబాబులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఈ నెల 31వ తేదీన అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. వారిని అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన్, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు మౌలాబీ

త్రిపుల్ ఐటీ విద్యార్థికి అభినందన

చేబ్రోలు: మండలంలోని నారా కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.చిత్రలేఖ పదో తరగతిలో 578 మార్కులతో మొదటి స్థానంలో నిలిచి, నూజివీడు త్రిబుల్ ఐటీలో ప్రవేశం పొందింది. సోమవారం విద్యార్థిని అభినందన కార్యక్రమం జరిగింది. సమావేశానికి హెచ్ఎం ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఎంఈవో ఏహెచ్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల నుంచి ఏటా త్రిబుల్ ఐటీలో విద్యార్థులు ప్రవేశం పొందడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్ల ప్రతిభ గల విద్యార్థులకు మేలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని బి. చిత్రలేఖను శాలువా, మెమెంటోతో సత్కరించారు. నగదు బహుమతి అందజేశారు. 500 పైగా మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలను గణిత ఉపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు బహూకరించారు. అలాగే ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం. ఏడుకొండలు మెరిట్ విద్యార్థుల కోసం రూ. 25 వేలు డిపాజిట్ చేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కలిసి సుమారు రూ. 20వేలు నగదును సబ్జెక్ట్ వారీగా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వి.నాగ మల్లేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, గౌరీ పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో ఏహెచ్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు

గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు

తెనాలిరూరల్: తెనాలి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు వచ్చాయి. సర్వే కోసం రెండు, పట్టాదారు పాసు పుస్తకాల కోసం రెండు, నివేశన స్థలాల కోసం రెండు వచ్చాయి. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గ్రీవెన్స్‌కు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు.

సంస్కృత భాషాభివృద్ధికి బాటలు వేసిన ఉన్నవ దంపతులు

గుంటూరు ఎడ్యుకేషన్: సంస్కృత భాషాభివృద్ధికి బాటలు వేసిన ఉన్నవ దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని శ్రీశారదానికేతన్ విద్యాసంస్థల కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ సంస్కృత భాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శారదానికేతన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులైన ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు సంస్కృత భాషాభివృద్ధికి ఆనాడే విశేష కృషి చేశారని కొనియాడారు. విద్యార్థినులు సంస్కృత భాషలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఓరియెంటల్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఆర్.దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.ఉషా కుమారి పాల్గొన్నారు.

సంస్కారాన్ని నేర్పించే సంస్కృతం

మనిషిని సంస్కరించి, సంస్కారాన్ని నేర్పించేది సంస్కృత భాష అని ప్రముఖ సంస్కృత, జ్యోతిష్య పండితుడు ధూళిపాళ్ల భాస్కరశర్మ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సంస్కృతభారతి, సంస్కృత విభాగం సంయుక్తంగా సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. భాస్కరశర్మ మాట్లాడుతూ సంస్కారవంతమైన భాష, ఉచ్చారణతోనే మనిషి సమాజంలో గౌరవించబడతారని అన్నారు. మన పూర్వీకులు విలువైన నిధిని భూమిలోనూ, జ్ఞాననిధిని బుర్రలోనూ దాచారని చెప్పారు. అన్ని భాషలకు సంస్కృతం తల్లి వంటిదని, మానవ జీవనానికి సంస్కృతం దిశ, దశ చూపిస్తుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ శ్రావణ పూర్ణిమ విశ్వ సంస్కృత దినోత్సవమని, అపారమైన జ్ఞానరాశి సంస్కృతంలో ఉన్నదని తెలిపారు. సంస్కృత భాషపై పట్టు సాధించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఎన్ని భాషల్లోనైనా ప్రావీణ్యం సంపాదించవచ్చునని, అన్ని భాషలతో పాటు సంస్కృతాన్ని నేర్చుకోవాలని సూచించారు. కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పి.దేవేంద్రగుప్తా మాట్లాడుతూ సంస్కృత భారతి కృషితో దేశంలో ఎనిమిది సంస్కృత గ్రామాలు ఏర్పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ భానుమురళీధర్, ఎన్ఎస్ఎస్ అధికారి జీవీ సుధీర్‌కుమార్, అధ్యాపకులు అంజనీకుమార్, ఆర్.స్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాస్కరశర్మ

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పొన్నూరు: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వి.రామ కోటేశ్వరి హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని ఎరువుల దుకాణాలలో ఏవో వెంకటరామయ్యతో కలిసి ఆమె తనిఖీలు నిర్వహించారు. విక్రయాలకు సంబంధించిన బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు పలు సూచనలు చేశారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ అన్ని ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. మండలంలోని డీసీఎంఎస్, నిడుబ్రోలు, పీటీ పరువు, దుప్పలపూడి, మునిపల్లి, చింతలపూడి, పెదపాలెం, భారతి నగర్ సొసైటీల్లో కూడా డీఏపీ, కాంప్లెక్స్ యూరియా అందుబాటులో ఉన్నాయని ఏడీఏ వెల్లడించారు. రైతులు సరిపడా ఎరువులు మాత్రమే కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు.